www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 01 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8

# యాసంగి గోస..!

- అందని రైతుభరోసా
- జిల్లా వ్యాప్తంగా 1.50 ఎకరాల్లో పంటల సాగు
- ఇప్పటికే 80 శాతం పూర్తి
- అప్పుల్లో అన్నదాతలు





2లో

# హస్తంలో సయోధ్య కుదిరేనా..?

-పోటాపోటీగా నామినేషన్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. కొందరు ఒకే వర్గం నుంచి మున్సిపల్ ఛైర్మన్ స్థానం కోసం ప్రయత్నం చేస్తుండగా మరికొన్ని చోట్ల వర్గపోరుతో పోటాపోటీగా నామినేషన్లు వేశారు. బిఫామ్ సంగతి పక్కనపెడితే సయోధ్య కుదరకుండ ఎన్నికల్లో గెలుపు ఎలా అన్నది ఇప్పుడు కాంగ్రెస్ నేతలను ఆలోచించేలా చేస్తుంది. ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా వైరాలో ఇద్దరు మంత్రుల అనుచరుల మధ్య పోటాపోటీ నెలకొంది. వైరా మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానం మహిళలకు రిజర్వు చేయబడింది. ఛైర్‌పర్సన్ స్థానం కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అనుచరుడు, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు బొర్రా రాజశేఖర్ పోటీ పడుతున్నారు. ఇద్దరు ఛైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సతీమణి 11, 15 వార్డుల్లో నామినేషన్‌లు దాఖలు చేయగా బొర్రా రాజశేఖర్ సతీమణి ఉమాదేవి తో పాటు బొర్రా రాజశేఖర్ తల్లి, వైరా మాజీ సర్పంచ్ పద్మావతి కూడా నామినేషన్ దాఖలు చేశారు. అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. మధిరలో కూడా ఇదే పరిస్థితి. కాకపోతే స్థానిక శాసనసభ్యుడు కూడా అయినా మిగతా 2లో..

## నిబంధనలు తుస్..
# పంపిణీ షురూ..!

-మున్సిపల్ ఎన్నికల్లో నిబంధనలకు తూట్లు
-ప్రారంభమైన ప్రలోభాల పర్వం






**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్నికల సంఘం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించడమే కాకుండా ఖర్చు విషయంలో పాటించాల్సిన నియమాలను వివరిస్తుంది. ఓటర్లను ప్రలోభపెడితే ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరిస్తుంది. గతంలో ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపరిచేందుకు చేసే చిన్న చిన్న మిగతా 2లో..

## జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన

-మంత్రి తుమ్మల
-పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



2లో

## పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం

- కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి
ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి



2లో

# ఆశల ఒడిలో మక్క రైతు



-ఈ ఏడాది విస్తారంగా సాగు
-కొనుగోళ్లపై రైతుల్లో ఆందోళన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏపుగా ఎదిగిన పైరు, దిగుబడికి ఢోకా లేదన్న ధీమా నడుమ ఆశల ఒడిలో మొక్కజొన్న రైతులు ఉన్నారు. వాతావరణం సానుకూలంగా ఉండడంతో మొక్కజొన్న ఈ ఏడాది అధిక దిగుబడిని ఇవ్వవచ్చునని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీనితో నీటి వసతి కలిగిన భూముల్లో పత్తి తర్వాత రెండవ పంటగా మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న పైరు బాగుండడడంతో రైతులు పత్తి తెచ్చిన నష్టాన్ని మొక్కజొన్న పూడుస్తుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేయడంతో కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తుతాయోమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. గతేడాది ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2225 లుగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధరను పెంచి క్వింటా ఒక్కింటికి మిగతా 2లో..

# హస్తంలో సయోధ్య కుదిరేనా..?

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి వర్గం నుంచే ఛైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ కుల సమీకరణలకు అనుగుణంగా ఛైర్మన్ స్థానాన్ని కేటాయించాలని కోరుతున్నారు. కొందరు కావాలనే మిత్రపక్షాల మధ్య సయోధ్య కుదరనివ్వడం లేదని సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే మధిరలో సైతం కాంగ్రెస్ గట్టి పోటీని ఎదుర్కొనక తప్పకపోవచ్చు. ఇప్పటికే సిపిఎం, బిఆర్ఎస్ ఉమ్మడి గా పోటీ చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించాయి. కల్లూరులోనూ ఇదే పరిస్థితి. కాంగ్రెస్‌లో సయోధ్య కుదరకపోవడం అభ్యర్థులను ఎంపిక చేయడంలో జరిగిన జాప్యం అధిక సంఖ్యలో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ వేయడానికి కారణమైంది. సత్తుపల్లిలో కూడా ఇదే పరిస్థితి. కొత్తగూడెంలో ప్రత్యేక పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లో ఒక వర్గం హడావుడి చేస్తుండగా మరో వర్గం దీనిని సహించలేకపోతుంది. కొత్త పెత్తనంపై అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఇల్లందు, అశ్వారావుపేటలోనూ అధికార కాంగ్రెస్‌లో సక్యత అంతగా లేదన్న ప్రచారం జరుగుతుంది. కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో ఉంటామని ఇప్పటికే ప్రకటించారు. మొత్తంగా నామినేషన్ల ఉపసంహరణకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో కాంగ్రెస్ పెద్దలు వార్డుల వారీగా కూర్చుని అభ్యర్థుల మధ్య సయోధ్య కుదర్చనిపక్షంలో ఎన్నికలఫలితాలపై ప్రభావంచూపే అవకాశం ఉంది.

**ఖర్చుపై చర్చలు :**

అభ్యర్థిత్వం కోరుతున్న వారు ఎంత ఖర్చు చేయగలరని పార్టీ నాయకత్వం ప్రశ్నిస్తుందని ఓ అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంత కాలం పార్టీ జెండాను నమ్మి పార్టీ కోసం పనిచేస్తే ఇప్పుడు ఆర్థిక పరిస్థితులపై ఆరా తీస్తున్నారని కొందరు వాపోతున్నారు. పార్టీ జెండాలు మోస్తూ ప్రజల్లో ఉన్న వారిని పక్కనపెట్టి రకరకాల వ్యాపారాలతో ఆర్థికంగా సంపాదించుకున్న వారిని ఇతరత్రా పనులతో కూడబెట్టుకుని ఎన్నికల్లో ఖర్చు చేయడానికి సిద్ధమైతే వారిని బరిలోకి దింపేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఖర్చు చేస్తున్నారు అంత వేయగలరా మీ అభ్యర్థిత్వం ఖరారు చేసిన తర్వాత డబ్బులు లేవంటే పార్టీ దెబ్బతింటుందని నేతలు అభ్యర్థులను హెచ్చరిస్తున్నారని పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికలంటేనే ఓట్ల కొనుగోలని ఇటువంటివి తప్పక పోవచ్చునని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# నేడు మంత్రి కొండా సురేఖ రాక

## -మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జిగా ఉన్న ఆమె వివిధ మున్సిపాలిటీల్లో జరిగే సమీక్షా సమావేశాల్లో పాల్గొంటారు. పాలేరు నియోజక వర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టిసివి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ఆమె హాజరుకానున్నారు. అనంతరం జిల్లాలోని మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో సురేఖ పర్యటించనున్నారు.

# నామినేషన్ల పరిశీలన పూర్తి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నామినేషన్ల పరిశీలన శనివారం పూర్తయింది. అశ్వారావుపేటలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురికాగా ఇల్లందులో రెండు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఒక్క నామినేషన్ కూడా తిరస్కరణకు గురి కాలేదు. మొత్తం 117 వార్డులకు గాను 776 మంది 787 నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 295, బిఆర్ఎస్ నుంచి 217 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇతర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి 61 నామినేషన్లు దాఖలయ్యాయి. 54 మంది స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు.

# జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెరిగిన నగర జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం నగరంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆరు, ఏడు డివిజన్లలో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నగర జనాభా ఐదు లక్షలకు చేరుకుంటుందని ఇందుకు అనుగుణంగా రహదారులు, త్రాగునీరు, ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఆయన సూచించారు. విద్య, వైద్య సౌకర్యాలు రాష్ట్రంలో ఎక్కడలేనివిధంగా ఖమ్మంలో ఉన్నాయని దేశంలోనే ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైనా స్వామి నారాయణ విశ్వ విద్యాలయం ఖమ్మంలో ఏర్పాటు చేయడం ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం దీనిని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి తుమ్మల తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని అమృత్ పథకం ద్వారా రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ. 200 కోట్లు, యుజిడి ద్వారా మరో రూ. 250 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏఎంసి ఛైర్మన్ హన్మంతరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి గోస..!

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రభుత్వం నుండి రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం నేటికీ అందక పోవడంతో అన్నదాతలు యాసంగి గోస పడుతున్నారు. వానా కాలం పంటలు పూర్తయిన తర్వాత రైతులు యాసంగి పంటల సాగు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 80 శాతం సాగు పూర్తయినప్పటికీ రైతుభరోసా అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దుక్కులు దున్నిన నాటి నుండి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే వరకు డబ్బులతో పనుండటంతో రైతులు ప్రభుత్వం నుండి అందే రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు.

**80 శాతం సాగు పూర్తి :** యాసంగి సాగు జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఇందులో వరి 73 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇప్పటికే వరి నాట్లు సుమారు 54 వేల ఎకరాల్లో పూర్తయ్యాయి. ఇక మొక్కజొన్న 52,300 ఎకరాలు, వేరుశెనగ 5వేల ఎకరాలు, అపరాలు 2 వేల ఎకరాలు, ఇతర పంటలు సుమారు మరో 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతానికి రైతులు 80 శాతం వరకు నాట్లు, వివిధ రకాల విత్తనాలు నాటుకున్నారు. ప్రతీ ఎటా ఎరువులు, విత్తనాలు, కూలీలు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం నుండి అందే సహాయం రైతులకు భరోసా కల్పించకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం తమ ఖాతాల్లో యాసంగి రైతుభరోసా సొమ్ములు ఎప్పుడు జమ చేస్తుందో అని గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు.

# పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి సొల్లు కబుర్లు చెబుతారు.. మాయమాటలతో మభ్య పెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మోహం పెట్టుకొని ఒట్టు అడుగుతారు? అని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3,4,5,6,25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారవం పూరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...అకౌంట్లు నింపుకోవడమే గత పాలకుల ధ్యేయంగా పాలనను కొనసాగించారని ధ్వజమెత్తారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోందన్నారు. ఇదివారి అవినీతికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదేనని ఎద్దేవా చేశారు.

**చేతల ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం**

తాము అధికరాంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.పని చేసే వాళ్లం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.22వేల500కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం అన్నారు. అర్హులైన ప్రతి పేవాడికి ఇళ్ల స్థలంలో పాటు రూ.5లక్షల సాయం అందిస్తాం అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500వందలకే గ్యాస్, 200యూనిట్ల ఉచితి విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఏదులాపురానికి కొత్త హంగులు**

ఏదులాపురంమున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం అన్నారు. ఎఫ్‌సిఐగౌడన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతుల కల్పిస్తాం అన్నారు. మీకష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా , అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# నిబంధనలు తుస్... పంపిణీ షురూ..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రలోభాలను కూడా జాగ్రత్తగా రాత్రి పూట చేపట్టే వారు. అధికారులు, పోలీసులు చూస్తే ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుందని అభ్యర్థులు భావించే వారు. కానీ పాల్వంచ మున్సిపాలిటీలో ఓ అభ్యర్థి నామినేషన్ వేయగానే ఇంటింటికి చీరలు పంచుతూ దానిని వీడియో తీయించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మరికొందరు ఫోటోలను షేర్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు ఎక్కడ చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల్లో గెలుపు కోసం ప్రలోభాలకు గురి చేసిన వ్యక్తి ఎన్నికల క్షేత్రం నుంచి తప్పించడంతో పాటు కేసులు నమోదు చేయాల్సి ఉంది. బరితెగించి చీరలు పంచుతూ దానిని వీడియో రూపంలో విస్తృత ప్రచారం చేస్తున్న వారిని కూడా ఎందుకు ఊపేక్షిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. పంపిణీ కవరు పైన ఎన్నికల గుర్తు, అభ్యర్థి పేరు వేసి పంపిణీ చేస్తున్న పట్టించుకోకపోవడం శోచనీయం. కౌన్సిలర్ అభ్యర్థులు ఖర్చు చేయాల్సిన మొత్తంపై పరిమితులు ఉన్న విషయం విధితమే. అయినా అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులు ఇచ్చిన ఖర్చులను చూసుకోవడం తప్ప ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించేవిధంగా చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతుంది. ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సామాన్యులు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి కరువైంది.

# గాయపడిన వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం లింగాలకు చెందిన మేకల రమేష్ (43) గత 15 రోజుల క్రితం లింగాల గ్రామంలో రోడ్డు పై నుంచి ఇంటిలోకి వెళుతున్న సమయంలో తల్లాడ మండలం కుర్నవల్లి కి చెందిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన అతనిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యం పొందుతూ శనివారం మృతి చెందారు. కల్లూరు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. భార్య పిల్లలు కుటుంబం పేదవారు కావడంతో అనాథలుగా మారారు. దీంతో కుటుంబం వీధిన పడింది గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు .

# ప్రజల కోసం పరితపించే నాయకుడు కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజల కోసం పరితపించే నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డి అని సిపిఎం రాష్ట్ర నాయకులు పీ సోమయ్య, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధులు అన్నారు. కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన దాచేపల్లి కృష్ణారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈసభలో నాయకులు మాట్లాడుతూ అందరితో కలుపుగోలుగా ఉండే కల్మషం లేని వ్యక్తి అని కొనియాడారు. గాదెపాడు ప్రాంత ప్రజలకు ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారం కోసం పట్టుబట్టి పని చేసేవారన్నారు. రైతాంగ సమస్యలపై ముందుడి పోరాటాలు నెరిపారని, చేపల సొసైటీ అభివృద్ధి కోసం పని చేశారన్నారు. కృష్ణారెడ్డి మృతి ఆయన కుటుంబానికే కాక ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ బానోత్ చంద్రావతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, మాజీ జెడ్‌పిటిసిలు ముత్యాల సత్యనారాయణ, బానోత్ దేవ్లా నాయక్, ఉన్నం వీరందర్, వాంకుడోత్ జగన్, సిపిఎం నాయకులు కేసగాని రామ్మూర్తి, ఎండి ఇస్మాయిల్, కొండబోయిన ఉమావతి, తుమ్మోజు రామ్మూర్తి, తలారి దేవ ప్రకాష్, గడిపర్తి వీరభద్రరావు, కేలోత్ సూర్యకుమార్, నాగళ్ళ శ్రీనివాసరావు, కేసగాని ఉపేందర్‌రావు, పోతర్ల నాగేశ్వరరావు, నానబాల మల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు, ముత్యాల వెంకటప్పారావు, దారావత్ మంగీలాల్, హన్మకొండ రమేష్, కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య పాల్గొన్నారు.

# ఆశల ఒడిలో మక్క రైతు

(మొదటిపేజీ తరువాయి)

రూ. 2400 చొప్పున కొనుగోలు చేయనుంది. సాగును దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో మాదిరి జాప్యం జరుగుతుందేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. ప్రభుత్వం సాగుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను పెంచాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండటం, స్వల్పకాలిక పంట కావడం, దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో గడిచిన ఐదేండ్ల నుంచి మొక్కజొన్నను విరివిగా సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌లో కూడా సాగు చేస్తున్నప్పటికీ వర్షాలు ఇతరత్రా అనుకూల పరిస్థితులు ఉండడంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు ప్రాథమిక అంచనా. ఈ అంచనాకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

# ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**-దివ్యాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలకు అనుకూలంగా రూపొందించాలి**
**-అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఆధునిక మౌలిక వసతులతో పాటు ప్రజలకు నడకలో సౌకర్యం, ఆరోగ్యం, భద్రత కల్పించే విధంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతం నుండి చేపట్టనున్న ఫుట్‌పాత్‌పై వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసే పనులను, టైల్స్ డిజైన్ ఆకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా, భద్రత ఉండేలా నిర్మించాలని తెలిపారు. చిన్నపిల్లలు, దివ్యాంగులు, వృద్ధులకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిచేవిధంగా పనులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి అనేది కేవలం రోడ్లు, భవనాల నిర్మాణంతోనే కాకుండా ప్రజల రోజువారి జీవితాన్ని సులభతరం చేసే మౌలిక వసతులతో ముడిపడి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల నడక ద్వారా ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి అత్యంత కీలకమన్నారు. విద్యార్థులు, ప్రజలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితులు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో సౌకర్యవంతంగా ఫుట్‌పాత్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తొలిసారిగా నగరంలో వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఈ యాకూబ్‌అలీ, ఖమ్మం గ్రానైట్ యాజమాన్యాలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటిని సందర్శించిన బహుళ జాతి ఐటి సంస్థ వర్చుసా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ ఐటి రంగ సంస్థ వర్చుసా హెచ్ఆర్ తమ కళాశాలను సందర్శించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ టూ కార్పోరేట్ కార్యక్రమంలో వర్చుసా సంస్థ సీనియర్ హెచ్ఆర్ అభిషేక్ పాల్గొన్నారు. కార్పోరేట్ రంగానికి అవసరమైన మెళకువలు, విద్యార్థులకు అవసరమైన ఏఐ నైపుణ్యాలు, వ్యక్తిగత క్రమశిక్షణ వంటి అంశాలపై అభిషేక్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ అమెరికా కేంద్రంగా ఐటి సేవలు అందిస్తున్న వర్చుసా కంపెనీ తమ కళాశాలను ఎంపిక చేసి విద్యార్థులతో ముచ్చటించడం భవిష్యత్తు కార్యాచరణపై అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు తాము చేసిన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హ్యాక్‌థాన్ ఐడియాథాన్ వంటి పోటీల్లో చురుగ్గా పాల్గొని టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని, దిశా నిర్దేశం చేసినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలు, సందేహాలను హెచ్ఆర్ అభిషేక్ నివృత్తి చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్, గూగుల్, అడోబ్, సేల్స్ ఫోర్స్, పెగా వంటి అంతర్జాతీయ సంస్థలు క్లయింట్స్‌గా కలిగిన వర్చుసా సంస్థలో



రానున్న రోజుల్లో ఇంటర్న్‌షిఫ్, వర్క్‌షాప్, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపై అవగాహన కలిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో తమ కళాశాల ప్రత్యేక గుర్తింపు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు భవిష్యత్తులో మరిన్ని బహుళ జాతి సంస్థలను కళాశాలకు ఆహ్వానించడంతో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ హెచ్ఆర్ అభిషేక్‌ను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, ఇన్నోవేషన్ బాధ్యులు డా॥ ఎం. మురళీమోహన్, వివిధ విభాగాల హెచ్‌వోడిలు, టిపివో సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జంతువుల పట్ల కరుణ చూపాలి

**-జిల్లా పశు సంవర్థక శాఖాధికారి పురందర్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జంతువుల పట్ల కరుణ చూపాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డా॥ బి. పురందర్ తెలిపారు. ఖమ్మం నగరంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥ పురందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జంతు సంక్షేమ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంతువుల ఆరోగ్యం, సంరక్షణ, వీధి జంతువుల సమస్యలు, జంతువులపై జరిగే క్రూరత్వం, దుష్పరిణామాలను వివరించారు. జంతువులు మాట్లాడలేని జీవులని వాటి బాధను అర్థం చేసుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జంతు సంక్షేమం కేవలం ఒక కార్యక్రమం కాదని అవి జీవితాంతం పాటించాల్సిన విలువలన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థులు జంతువుల పట్ల కరుణను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో మానవీయ సమాజం నిర్మితమవుతుందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డా॥ కె. క్రాంతి కుమార్, జేవివో టి. కృష్ణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో ముగిసిన స్పోర్ట్స్ మీట్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్పోర్ట్స్ మీట్‌లతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందుతుందని మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కంబంపాటి నారాయణరావులు తెలిపారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడా పోటీల ద్వారా మరింత చురుకుతనం, ఏకాగ్రత, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తి పెరుగుతుందన్నారు. స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వారి అభిరుచులకు తగినట్లుగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పాఠశాల ఛైర్మన్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు అన్ని రకాల క్రీడా పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం (కొత్తగూడెం) జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, దివ్యాంగ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోనుటకు గడువు పొడిగించినట్లు షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు డా॥ ఎస్. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ద్వారా ఐదు నెలల పాటు వివిధ రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు ఆర్ఆర్‌బి, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోనుటకు ఫిబ్రవరి 22 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం మూడు లక్షల వరకు ఉన్నటువంటి వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం షెడ్యూల్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారిచే ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రవేశపరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఖమ్మం జిల్లా కేంద్రంలో గల స్టడీ సర్కిల్‌లో నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్ ఛార్జీలు బుక్‌ఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, సెల్ నెం. 9866726277, 7981988667ను సంప్రదించాలన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన తొమ్మిది మంది లబ్దిదారులకు రూ.2,95,000/ విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నారగాని రాంబాయి, ఉపసర్పంచ్ అంబటి శరత్, మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, వెచ్చా మంగపతిరావు, నెల్లూరి రమేష్, గుడిపుడి రమేష్, ఎల్లంపల్లి అప్పారావు, వార్డు సభ్యులు , లబ్దిదారులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులకు సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తన కార్యాలయంలో శనివారం సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంకా పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. విధినిర్వాహణలో తోడ్పాటునందించిన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. బావిజీవితం కుటుంబసభ్యులతో, ఆయూరారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో డి రామయ్య (ఎస్సై), ఏ గోపి (ఏఆర్ఎస్సై) ఎస్‌కె యాకుబ్ పాషా (ఏఆర్ఎస్సై), పి.శాంతిరెడ్డి (ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్), జి వెంకన్న (హోంగార్డు, పిఎల్‌సి) ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు అడ్మిన్ భోజా రామానుజం, లా అండ్ ఆడర్ ప్రసాద్‌రావు, ఏసిపి సుశీల్‌సింగ్, ఆర్ఐ శ్రీశైలం, నాగుల్ మీరా, పోలీసు ఆసోసియేషన్ ఇన్‌చార్జ్ అద్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఆర్ ఎస్ఐ లక్ష్మణరావు, జిల్లా హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక శ్రీను, సభ్యులు సిహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పది విద్యార్థుల అల్పాహారానికి విరాళం



**ప్రజాపక్షం/చింతకాని :** లచ్చగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల సమయంతో అల్పాహారం కోసం శనివారం లచ్చగూడెం సర్పంచ్ కొప్పుల రజని రూ.8వేలు విరాళం ఇచ్చారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణకు ఈ నగదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంగా చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలన్నారు. పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపాధ్యాయులు, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్‌నేరస్తులు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆన్‌లైన్‌లో ట్రైడింగ్ లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 18 లక్షల రూపాయలు కాజేసి మోసంచేసిన కేసులో ఇద్దరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు ఆధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్‌క్రైం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి..ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి వాట్సప్‌లో పరిచయమైన ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ లో పెట్టుబడిపెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి ట్రేడింగ్ లింక్‌లు పంపి వాటి ద్వారా సుమారు 18 లక్షల రూపాయలు కాజేశారు. మోసపోయానని గుర్తించిన సదరు బాధిత ఉద్యోగి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చివరిగా ఒక లక్ష ఎనభైవేల రూపాయలు బదిలి అయిన రెండు బ్యాంక్ ఖాతాలు ఆంధ్రప్రదేశ్ వైజాగ్‌కు చెందిన ఉమాశంకర్, హేమలతవిగా గుర్తించి అక్కడకు వెళ్లి వారిని అరెస్ట్ చేశారు. నిందితులు ఇద్దరిని ఖమ్మం తీసుకువచ్చి శనివారం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలిపారు. కేసును చేధించిన సైబర్ క్రైం డిఎస్‌పి ఫణిందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు భానుమూర్తి, కిషన్‌రావు, కృష్ణప్రసాద్, అఫ్సనా లను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఈ సందర్భంగా అభినందించారు.

# కడవరకు ఎర్రజెండా నీడలోనే అచ్చన లాలాయ్య

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

ప్రజాపక్షం/కొణిజర్ల : సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి ఆదర్శ కమ్యూనిస్టు అచ్చన లాలయ్య కడవరకు ఎర్రజెండానీడలోనే కొనసాగారని సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని పెద్ద మునగాలలో శనివారం అచ్చన లాలయ్య 5వ వర్ధంతి కార్యక్రమం తలారి కృష్ణ అధ్యక్షతన జరిగింది. మండలంలోని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన ఉత్తమ కమ్యూనిస్టు అని ప్రజాపోరాటంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా వెనకడగు వేయని ధైర్యశాలి అని కొనియాడారు. జనవరి 18న ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగసభ కమ్యూనిస్టులు లేరని చెప్పుకునేవాళ్లకు సమాధానంగానిలిచిందని అన్నారు. ఆ ఉత్సవాల స్ఫూర్తితో భవిష్యత్‌లో కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతు అచ్చన లాలయ్యతో సుధీర్ఘకాలం పనిచేసిన సంబంధం ఉన్నదని అన్నారు. రైతుసంఘం నాయకులుగా రైతుల సమస్యలకోసం కలిసి పోరాటం చేసిన సంఘటనలు గుర్తు చేసుకునానరు.



ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు జిల్లా సమితి సభ్యులు పాపగంటి సుదర్శన్, మునిగె కోటేశ్వరరావు, పెద్ద మునగాల ఉపసర్పంచ్ సుంకర రాధాకృష్ణ, పిట్టల రాంబాబు, తలారి పాపయ్య, తుప్పతి ముత్తయ్య, అచ్చన శ్రీను, ఏపూరి భాస్కర్‌రావు, సోలా పిచ్చయ్య, బన్నె నరసింహారావు, చింతల నారాయణ, నడిపి వెంకులు, దాడి కృష్ణయ్య, దాసరి పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు దక్కించుకున్న ముత్యాల

ప్రజాపక్షం/వైరా: మాస్టర్ ప్రేమ్ ఫైన్ ఆర్ట్ ఫొటోగ్రాఫి అకాడి వారు జనవరి 28 నుంచి 30 వరకు ఆంధ్ర ప్రదేశ్ ఈస్ట్ గోదావరి జిల్లా మోతుగూడెంలో నిర్వహించిన జాతీయస్థాయి ఫొటోగ్రాఫి వర్క్‌షాప్ నందు ముత్యాల నాగేశ్వరరావు జనరల్ విభాగంలో ఉత్తమ బహుమతి అందుకున్నాడు. వైజాగ్‌కు చెందిన ప్రముఖ మోడల్ ఫొటోగ్రాఫర్ అగర్వాల్ పర్యవేణలో మూడు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మంది ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జనరల్, ట్రేడిషనల్,గ్లామర్ విభాగాల్లో కాంపిటీషన్ నిర్వహించంగా జనరల్ విభాగంలో నాగేశ్వరరావు గిరిజన జీవన విధానంపై తీసిన ఫొటోకు ఉత్తమ బహుమతి లభించింది. గతంలో కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేకసార్లు అవార్డులు దక్కించుకున్నారు. నాగేశ్వరరావు ఈ అవార్డు రావడం పట్ల స్థానిక ఫొటోగ్రాఫర్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఫొటోగ్రాఫి అధ్యక్షులు వెంకట్, సిఎన్‌సి శ్రీను, ప్రసాద్, రవి, ఆర్గనైజర్ జగన్, జిల్లా కమిటీ సభ్యులు, ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.





# మీ ఇంటి బిడ్డలా ఆశీర్వదించండి

## బిఆర్ఎస్ చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి

ప్రజాపక్షం/వైరా: మీ ఇంటిబిడ్డల మీ ముందుకు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రజాసేవలో పాల్గొనేందుకు వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఎం పార్టీ మద్దతుతో ఐదో వార్డు నుండి బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నానని మీ అందరూ ఆశీర్వదించి అండగా ఉండాలని బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి అన్నారు. ప్రజాక్షేత్రంలో గత కొన్ని సంవత్సరాల నుండి నా భర్త కట్టా కృష్ణార్జున్‌రావు ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారని, అదేవిధంగా నేను కూడా మీ అందరిలో భాగస్వామ్యమై వైరా మున్సిపాలిటీని అభివృద్ధిపధంలో భాగస్వామ్యమై వైరా మున్సిపాలిటీ అభివృద్ధి పధంలో ఉంచేందుకు అందరం కలిసి ముందుకు సాగుదాం, నాతో పాటు 20 వార్డుల్లో పోటీ చేస్తున్న బిఆర్ఎస్, సిపిఎం అభ్యర్థులను గెలిపించి వైరా మున్సిపాలిటీలో భాగస్వాములు అయ్యేందుకు అవకాశం కల్పించాలని మీ కూతురులా, మీ ఇంటి బిడ్డలా కోరుతున్నానని బిఆర్ఎస్ చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా సుస్మిత్ స్వరూపరాణి అన్నారు.



# విజయవంతంగా ముగిసిన సీఎం కప్ క్రీడలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని బోదులబండ లో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. 30, 31 రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. మొత్తం 6 క్లస్టర్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో జరిగిన పోటీ రసవత్తరంగా జరిగాయి. విద్యార్థులకు రెండు రోజుల పాటు పెందుర్తి మధుసూదన్ రావు మెమోరియల్ ట్రస్టు వారు భోజన వసతి తో పాటు, బహుమతులు ప్రధానం చేశారు. దాదాపు రూ.65 వేల ను క్రీడల నిర్వహణ కు అందించి దాతృత్వం ను చాటుకున్నారు. మండల స్థాయిలో ప్రతిభచూపిన క్రీడాకారులను గుర్తించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు,



మండల విద్యాశాఖాధికారిబాలిన చలపతిరావు, సర్పంచ్ కట్టెకోల నాగార్జున రావు, క్రీడల నిర్వహణ ఆర్గనైజర్ కార్యదర్శి డి.రామకృష్ణ, హెచ్‌ఎం నిర్మలాకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోడాలి గోవింద రావు, బచ్చలకూరి నాగరాజు, ఉపాధ్యాయులు ఎన్.జయరాజ్, పీడీలు, పీఈటీలుతదితరులు పాల్గొన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన స్కూటీ.. తల్లీకూతురికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : కోదాడఖమ్మం హైవే సర్వీస్ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు పంట కాలువ లోకి పల్టీకొడుతూ దూసుకెళ్లింది. దీంతో తల్లి, కూతురు కు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు,ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన తల్లి, కూతురు శనివారం స్కూటీ పై హైవే పక్కన సర్వీస్ రోడ్డు న బోదులబండ వైపు వెళ్తున్నారు.



వెనక నుంచి లారీ వస్తుండుగా పక్కకు జరిగే క్రమంలో స్కూటీ అదుపు తప్పి, డ్రైనేజీ లేకపోవటంతో కాలువ లోకి దూసుకెళ్లింది. సిమెంట్ ర్యాంపు కావటంతో పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు కు తీవ్ర గాయాలైయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి కాలువ లోకి దిగి క్షతగాత్రులను, స్కూటీ ని బయటకు తీశారు. ఇరువురును స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రథమ చికిత్స చేయించారు.

# సంగయ్య చిత్రపటానికి దండి నివాళి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 31వ డివిజన్‌కు చెందిన పొన్నెకంటి సంగయ్య ఇటీవల మృతి చెందారు. కాగా శనివారం దశదినకర్మను ఇంటి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హాజరయ్యి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ నాయకుడు మేళ్లచెర్వు పెద్ద లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# ముమ్మరంగా సిపిఐ అభ్యర్థుల ప్రచారం





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీలో సిపిఐ అభ్యర్థులు శనివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా 31,32,28,29,30 డివిజన్లలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొని కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే 28వ డివిజన్లో సిపిఐ అభ్యర్థి దండి రంగారావు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానికుడిగా ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇటుక కూడా పెట్టని, స్థానికత లేని వారు ఓట్లకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్‌ఉదయ్‌కుమార్‌కు అవార్డు

ప్రజాపక్షం/ బోనకల్ : జాతీయస్థాయి ఫొటో గ్రఫీ వర్క్‌షాపులో నిర్వహించిన స్పాట్ కాంపిటీషన్ నందు ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిన్నబీరవల్లికు చెందిన చల్లా ఉదయ్‌కుమార్ జనరల్ కేటగిరిలో ప్రథమ స్థానంలో నిల్చిన ఉత్తమ ఫొటోగ్రఫర్ అవార్డును గెల్చుకున్నారు. ఖమ్మం జిల్లా వాసి ఇమాక్ జగన్ ఆధ్వర్యంలో మోతుగూడెంలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి ఫొటో గ్రఫీ వర్క్ షాప్‌లో ఐదు రాష్ట్రాలకు చెందిన సుమారు 50మంది ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపుల్లో ఖమ్మం పట్టణ సీనియర్ ఫొటో గ్రాఫర్ సిఎన్‌సి శ్రీనివాసరావు, వర్క్ షాపు నిర్వాహకులు జగన్ ఆధ్వర్యంలో ఫొటో గ్రాఫర్లకు మెళకువలను నేర్చుకున్నారు. అనంతరం ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనర్చిన వారికి అవార్డులు, సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్, కోశాధికారి తిరుపతిరావు, ఐదు రాష్ట్రాల స్థాయి ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.






# దొంతెబోయిన వెంకటేశ్వర్లును గెలిపించండి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో సిపిఎం బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దొంతెబోయిన వెంకటేశ్వర్లును గెలిపించాలని మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. శనివారం దొంతెబోయిన వెంకటేశ్వర్లు విజయాన్ని కాంక్షిస్తూ మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి సోమవరం గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ సిపిఎం, బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని, బిఆర్ఎస్ చైర్మన్ కైవసం చేసుకోవాలని ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వర రావు, పగడాల నాగరాజు, మేదరమెట్ల రాము తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాల కవచ అలంకారంలో స్వామి వారి దర్శనం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు అమ్మవార్లు శనివారం ముత్యాల అలంకార రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చా రు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అమ్మవార్లకు నిత్య కళ్యాణం ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం కావడంతో ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సోమయ్య, కృష్ణప్రసాద్, అర్చకులు ఎం.వెంకటరమణ, మురళీమోహన్‌శర్మ, రఘురామకృష్ణశాస్త్రి, రాజీవ్‌శర్మ, రామకృష్ణ శాస్త్రి, వేద పండితులు, విజయకృష్ణ, సాయి అభిలాష్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై దృష్టి సారించాలి

**-పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో దళితబంధు, మెప్మా, సోలార్ పవర్ ప్లాంట్స్, టూరిజం, భూ సేకరణ, ఇందిరా మహిళా డెయిరీ, తెలంగాణ పబ్లిక్స్ స్కూల్స్, అక్షయపాత్ర, ప్రభుత్వ కళాశాలలపై అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే పనులు వ్యక్తిగత శ్రద్ధతో త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. దళిత బంధు యూనిట్ల పెండింగ్ విడుదల పూర్తి చేయాలన్నారు. డైవర్ట్ అయిన యూనిట్ల విషయంలో చర్యలు వేగవంతం చేయాలన్నారు. మధిర నియోజక వర్గంలో మెప్మా కార్యకలాపాలు చేపట్టాలన్నారు. కొత్తగా 200 పట్టణ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు, 2వేల మంది కొత్త సభ్యుల చేర్పుకు చర్యలు తీసుకోవాలన్నారు. మధిరలో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు స్థలం గుర్తించాలన్నారు. బల్క్‌గా యూనిట్ల తయారీకి ఏజెన్సీతో టైఅప్ చేయాలన్నారు. ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, కల్లూరు మండలం చిన్నకోరుకొండిలో ఏర్పాటు చేస్తున్న ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. మహిళా దినోత్సవం మార్చి ఎనిమిది లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఖమ్మం లేక్‌వ్యూ క్లబ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జమలాపురం పర్యాటక అభివృద్ధి పనుల్లో చైన్‌లింక్ ఫెన్సింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రొటక్షన్ వాల్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, బౌద్ధస్తూపం పనులు వేగవంతం చేయాలన్నారు. స్తూపం వద్ద పనులతో పాటు పర్యాటకుల ఆకర్షణకు బోటింగ్, బండ్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గుర్రాలపాడు అసంపూర్తి డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద కమర్షియల్ కాంప్లెక్స్, హెల్త్ సబ్ సెంటర్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. హరిత హోటల్ నిర్మాణానికి స్థల గుర్తింపు చేపట్టాలన్నారు. ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించి ఇంకా చేపట్టాల్సిన చర్యలను వేగవంతం చేయాలన్నారు. పాల ధర ఎక్కువ వచ్చేలా హెరిటేజ్, మదర్, అమూల్ డెయిరీలను సంప్రదించాలన్నారు. మరో వైపు గేదెల కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. మధిర డిగ్రీ కళాశాల సిరిపురం ఐటిఐ బనిగండ్లపాడు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, డిఈవో చైతన్యజైని, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఎస్సి కార్పోరేషన్ ఈడి నవీన్ బాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, డిఆర్‌డివో శ్రీరామ్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 58 మంది బాలకార్మికులకు విముక్తి : ఎస్‌పి




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఆపరేషన్ స్మైన్ 2లో భాగంగా 58 మంది బాలకార్మికులకు విముక్తి లభించిందని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. జనవరి 1వ తేది నుండి 31వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను దాడులు నిర్వహించడానికి ఏర్పాటు చేశామన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో భాగంగా మొత్తం 58 మంది బాల కార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని, ఇందులో 9 మంది బాలికలు, 49 మంది బాలురు ఉండగా ఇతర రాష్ట్రాలకు చెందిన నలుగురు బాలికలు, 27 మంది బాలురు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాలబాలికలను పనిలో పెట్టుకున్న యజమానులపై 36 కేసులు నమోదు చేశామన్నారు. ఉట్టుకున్న వారిని సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఎక్కడైనా బాలకార్మికులు తారసపడితే డయల్ 100, 1098 గానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. నోడల్ ఆఫీసర్‌గా డిసిఆర్‌బి డిఎస్‌పి మల్లయ్య స్వామి వ్యవహరించగా షీటీమ్ ఎస్ఐ రాము, ఆర్ఎస్ఐ రమాదేవి, ఎస్ఐలు విజయ, సతీష్, శ్రావణ్, రాఘవయ్య, సమ్మిరెడ్డి, లక్ష్మణ్, ఏఎస్ఐ నాగయ్య, వీసీలు మల్లికాంబ, రాంబాబులను ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

# యూరియా సరఫరా పారదర్శకతకు ముందుగా బుకింగ్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** యూరియా సరఫరా సక్రమంగా, పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి అరుణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు ఇకపై యూరియా ఎరువును నేరుగా దుకాణాలను వెళ్లి కొనుగోలు చేయడం సాధ్యం కాదన్నారు. కావున ప్రతి రైతు తప్పని సరిగా మొబైల్ ఫోన్ ద్వారా యాప్‌లో నమోదు చేసుకొని అవసరమైన యూరియా పరిమాణాన్ని ముందుగా బుక్ చేసుకోవాలన్నారు. బుకింగ్ నిర్ధారణ తర్వాత మాత్రమే సంబంధిత ఎరువు దుకాణంలో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు తమ మొబైల్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఫెర్టిలైజర్ యాప్‌ను డౌన్ లోడ్ చూసుకోవచ్చునని తెలిపారు. అందరు రైతులు పై సూచనలకు గమనించి, ముందస్తుగా యూరియా బుకింగ్ చేసుకుని ఇబ్బందులు లేకుండా ఎరువు పొందాలని సూచించారు. మీ సందేహాల నివృత్తి కొరకు మీ యొక్క క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల్లో టికెట్ల లొల్లి




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా 20 వార్డులకు గాను నామినేషన్ ప్రక్రియ పూర్తి అయింది దీనిలో ఆశావాహులు అందరూ నామినేషన్ వేశారు. దీనిలో భాగంగా ప్రతి ఒక్కరికి నామినేషన్ వేయండి అంటూ ఆదేశాలు రావడంతో వేశారు. అనంతరం ప్రధాన రాజకీయ పార్టీలులో టిక్కెట్ల లొల్లి ప్రారంభమైంది. ఆశావహులు నామినేషన్ వేసిన వారు 10 లక్షలు సిద్ధం చేస్తేనే అభ్యర్థిత్వం ఖరారు అవుతుందని ప్రధాన రాజకీయ పార్టీ అధినాయకత్వాలు అల్టిమేట్ జారీ చేశాయి. ఇంకను అభ్యర్థిత్వం తేలకపోవటంతో నామినేషన్ వేసి బిఫార్మ్ కోసం వేయికళ్లతో ఎదురుచూపులు చూస్తున్నారు. ఆ పైగా 10 లక్షల చేసినట్లు రుజువు చేస్తేనే బి ఫామ్ అందిస్తామనిఅది నాయకత్వాలు కిందిస్థాయి నాయకత్వాలకు ఆదేశిస్తున్నారు. దీంతో ఆయా వార్డులలో ప్రజాబలం ఆర్థిక బలం గెలుపు గుర్రాలలో సర్వే లలో ముందంజలో ఉన్నవారు మాత్రమే రంగంలోకి దిగే అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు, పదో వార్డు, 15 వార్డు, 18 వ వార్డు, 20వ వార్డు జనరల్ కావడంతో అవార్డులలో ప్రధాన పోటీ అధికంగా ఉండటంతో ఆశావహులు అధికంగా ఉండటంతో బి ఫాం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రధానంగా ఒకటవ వార్డు ఐదో వార్డు 9వ వార్డు 13వ వార్డు 14వ వార్డు మహిళ లకు రిజర్వుడు కావడంతో మహిళా అభ్యర్థులను నిలబెట్టి బరిలో ఉంచి పురుషులు ప్రచారం కు సిద్ధమయ్యారు. వారిలో కూడా ప్రధానంగా ఇరువురు పార్టీలు కూడా ఎవరికి ఎవరిని నిర్ణయించకుండా నామినేషన్లు ప్రధాన పార్టీలు వేయించారు దీంతో వారికి బీఫామ్ ఎవరికోస్తుందో ఏమో అయోమయంలో ఉన్నారు. బీఫామ్ తో పాటు పదిలక్షల సిద్ధం చేస్తేనే నిర్ణయం చేస్తామని ప్రధాన పార్టీలు అల్టిమేట్ జారీ చేశారు . ప్రధానంగా నగదు తో పాటు ప్రజాబలం సర్వేలో ముందంజలో ఉన్నవారికి గెలుపు గుర్రాలకే బీఫామ్ ఇస్తామని తెలుపుతున్నారు. ఇప్పటికే బీఫామ్ ఇస్తారని ఆశతో కాసులను తయారుచేసుకొని ఉన్నారు. మరికొందరు ఇప్పటికే టికెట్ నాకే వస్తుందని ఇంటింటి ప్రచారంలో ప్రధాన పార్టీలు ఆయా వార్డుల్లో ముందంజలో ఉన్నారు. మరికొందరు ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వద్దకు ఎవరు పార్టీలకు చెందినవారు వారే పైరవీలు చేసుకుంటున్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతన్నాం




**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణను చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌కు ఆయన భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫిరెన్స్‌లో సమాధానం ఇస్తూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా బూత్ అధికారులు, సూపర్వైజర్లు ప్రతీ ఇంటికి వెళ్లి పరిశీలిస్తున్నారని, రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను ,తీసుకుంటామని, పెండింగ్‌లో గల ఫారం 6,7,8 దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతోందని బదులిచ్చారు.

# వికీపీడియా ద్వారా గిరిజన మ్యూజియాన్ని తెలుసుకున్నాం

**- ఫ్రాన్స్ దేశం నుండి వచ్చిన దంపతులు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** వికీ పీడియా ద్వారా భద్రాచలంలోని గిరిజన మ్యూజియం గురించి తెలుసుకున్న ఇక్కడిదాకా వచ్చినట్లు ఫ్రాన్స్ దేశానికి చెందిన దంపతులు ఫిలిప్,ఖ్యాతి ఫ్రాన్స్ అన్నారు. శనివారం వారు ట్రైబల్ మ్యూజియాన్ని వారు సందర్శించి కళారూపాలను తలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజన తెగల జీవన విధానాన్ని తెలుసుకునేందుకు ఈ మ్యూజియం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారి రాహుల్ నిజంగా ధన్యులు అన్నారు. ఇండియాలోని ఆదివాసీలు జీవించే ప్రాంతాలు బాగున్నాయని, వారి కట్టుబాట్లు, ఆచారాలు, పూజించే దేవతలు అంతా ప్రకృతికి నిదర్శనం అన్నారు. అనంతరం కొమ్ములు ధరించి డప్పువాయిద్యాలను వాయిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# అంగరంగ వైభవంగా ఇరుముడి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం తిరుపతమ్మ మాలధారణ ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. 41 రోజులు పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష ను పూర్తి చేసుకున్నారు. మండలం లోని భైరవునిపల్లి, నాచేపల్లి, నేలకొండపల్లి, పైనంపల్లి తదితర గ్రామాలలో మాలధారణ భక్తులు ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఇరుముడి సందర్భంగా భక్తులు ఆటా, పాటలతో సందడి చేశారు. ప్రతీ ఊరూరా..అమ్మ శరణం... తిరుపతమ్మ శరణం అంటూ శరణఘోష ను వినిపించారు. కొత్తకొత్తూరు లో జరిగిన కార్యక్రమంలో గురుస్వామి పులిపాటి శ్రీనివాసరెడ్డి. మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, గుగులోత్ వెంకటి, దీపిక తదితరులు పాల్గొన్నారు. నాచేపల్లిలో సర్పంచ్ మౌనిక, తేజావత్ గిరిస్వామి, నెహ్రూ, నరేష్, మహేష్, పుల్లయ్య, నగేష్, గణేష్, సైదులు, సాయి, అంజి, వినోద్, భైరవునిపల్లి లో కనకబండి సీతారాములు, బాలిన నారాయణ, కనకబండి రామయ్య, బాలిన కృష్ణంరాజు, భద్రజి వేంకటేశ్వరరావు, కుంచం బిక్షం, పొలంపల్లి నారాయణ, చిలివేరు రేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ బ్రోచర్ విడుదల చేసిన సీఐ శ్రీలక్ష్మి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని సాయి ఎక్సెలెంట్ పాఠశాలలో జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గాదె శ్రీ లక్ష్మి పాఠశాల డిజిటలైజేషన్ కి సంబంధించి బ్రోచర్ ను శనివారం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం అభినందించదగిన విషయం అన్నారు. అదేవిదంగా గత ఏడాది విద్యా సంవత్సరంలో సాయి ఎక్సలెంట్ పాఠశాలలో 10 నవోదయ సీట్లు, 70 గురుకుల సీట్లు సాధించడం కూడా చాలా సంతోషమన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సిఐ గాదె శ్రీ లక్ష్మి ని శాలువాకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా సెక్రటరీ, సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్ కరెస్పాండెంట్ జోహార్ జో, విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ నరసింహారావు, సాయి ఎక్సలెంట్ పాఠశాల డైరెక్టర్లు ఆరెబోయిన నాగలక్ష్మి , జక్కుల శివకుమారి, ఉపాధ్యాయులు నాగరాజు, అనిత, అశోక్, నభీన, దుర్గ భవాని, సత్యవతి, రమేష్, ఉదయభాను, పావని, సరిత, కళ్యాణి, ప్రశాంతి, భార్గవి, నందిని, అరుణ, స్వాతి, త్రివేణి, శిరీష, రిచిత, అరుణ, రమాదేవి, సౌజన్య, త్రివేణి, సునంద, హైమావతి, శాంతమ్మ, భాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు రమేష్, ఎస్కె చాంద్, వి చందర్, ఏ. అశోక్, అచ్చయ్య, సమీర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

**ప్రజాపక్షం/పాల్వంచ :** రహదారి ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన 8 మంది డిగ్రీ చదువుకొటున్న స్నేహితులు కలిసి మండల పరిధి కోడిపుంజువాగులో ఉన్న మరో స్నేహిడుతుడి వద్దకు వచ్చారు. వీరంతా కలిసి శనివారం ఆటోలో భద్రాచలం వెళ్ళారు. తిరిగి పాల్వంచకు వస్తున్న క్రమంలో పాల్వంచ రెజీనా పాఠశాల వద్ద తమ ముందున్న కారు ఒక్కసారిగా యూటర్న్ తీసుకొన్నది. వేగంగా వస్తున్న ఆటో కారును బలంగా ఢీకొట్టింది. దీనితో ఆకుల విష్ణు, రోహన్ యాదవ్, చాకలి క్రిష్ణ, చింతల సాయి శంకర్, చింతల రిషితేజ, గుగులోత్ శ్రీనాథ్‌లు అను ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ మేడ్చెల్ జగద్గిరిగుట్టకు చెందిన రోహిత్‌పటేల్ (19) అక్కడిక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని మార్చురీలో బద్రపరిచారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. కాగా మృతుడి బందువులు హైదరాబాద్ నుండి వస్తున్నారని ఇంకా కేసు నమోదు కాలేదని ఎస్ఐ. నాగరాజు తెలిపారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/చింతకాని :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి మంజూరైనరూ.8.50 లక్షల విలువగల సీసీ రోడ్లకు ఆయన మత్కేపల్లి సర్పంచ్ కంచం ద్రౌపది తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ పదేళ్ల కేసిఆర్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడ్డ తెలంగాణ నేడు లక్షల కోట్ల అప్పులతో లోటు బడ్జెట్ తోఉంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉద్యోగులకు మొదటి తారీకే జీతాలు ఇస్తుందన్నారు. పదేళ్లలో గ్రామాల్లో కనీసం పది ఇళ్లు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని బారాస నాయకులు నేడు గ్రామాల్లో మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంచం ద్రౌపది కోటేశ్వరరావు , ఉపసర్పంచ్ పగడాల పుల్లమ్మ, మార్కెట్ కమిటీ డైరక్టర్లు నర్సింశెట్టి శ్రీనివాసరావు, బందెల నాగార్జున, నాయకులు బొలికొండ రామారావు, నర్సింశెట్టి కోటేశ్వరరావు, గోద వెంకన్న , తిరుపతి రామ్మూర్తి , సంకెళ్ల పాపారావు పిఆర్ ఎఈ రఘు, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



**ప్రజాపక్షం/ బోనకల్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ నాయకులు కిలార్ సురేష్, తెలంగాణ అంగన్వాడీ టీచర్, హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల విజయలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని కలకోట, బోనకల్ గ్రామాల్లో శనివారం సర్కిల్ సమావేశాలను బండి జయం అధ్యక్షతన నిర్వహించారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్, పెద్దబీరవల్లి ఉపసర్పంచ్ పెద్దపోలు రామారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు చేబ్రోలు ఉషా, గండు శివ, నాగేంద్ర, కళ్యాణపు రాణి, గుగులోతు ఉష, మర్సకుంట్ల మరియమ్మ, రమణ సునీత, కొనకొల్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం



**ప్రజాక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన వేమిరెడి కిషోర్‌రెడ్డి, లావణ్య దంపతుల కుమారుడు జైఉద్భవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దాతలు సహకరిస్తే ప్రతిరోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తామని అన్నదానం చేయటం వల్ల వెంకటేశ్వస్వామి ఆశీస్సులు వారి కుటుంబాలపై ఉంటాయని సేవా సమితి కార్యదర్శి లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయలక్ష్మీ దేవీ, గౌరవాధ్యక్షులు బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మీ, ఈశ్వర్, చంద్ర విద్యాసాగర్, కార్యదర్శి ఎల్వీ నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, మాజీ ఇఒ అల్లూరి విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## 20 వార్డుల్లో పోటీ చేయనున్న బిజెపి



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** భారతీయ జనతపార్టీ ఆధ్వర్యంలో మధిర మున్సిపాల్టీలోని 22 వార్డులకు గాను 20వార్డులకు పోటీ చేయటం జరుగుతుందని, 20 వార్డుల్లో మహిళలకు 50శాతం కేటాయించటం జరిగిందని బిజెపి పార్టీ నాయకులు తెలిపారు. అలాగే బిజెపి తరుపున మైనార్టీ అభ్యర్థిని పోటీలో ఉంచటం జరిగిందని, బిజెపి పార్టీ అభ్యర్థులకు అవకాశం ఇస్తే మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అత్యధిక నిధులు తీసుకువచి అభివృద్ధి చేయటానికి బిజెపి పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అవినీతిరహిత, కమీషన్లు లేని పాలన అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షులు శివరాజ్ సుమంత్, మండల ప్రబారి మందడం సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు వీరవల్లి రాజేష్‌గుప్తా, జిల్లా కార్యదర్శులు రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, జిల్లా నాయకులు ఏలూరి నాగేశ్వరరావు, మర్సకట్ల స్వర్ణాకర్, బియ్యవరపు రామకృష్ణ, బొడ్డు మాధవ, పగడాల నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# అటకెక్కిన చెత్తశుద్ధి..!

-నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు
-గ్రామాలకు దూరంగా నిర్మాణం
-నిర్వహణపై దృష్టి సారించని అధికారులు



**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామాలను శుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి జీపీ పరిధిలో కంపోస్టు షెడ్లను నిర్మించింది. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రతి రోజు నివాస ప్రాంతాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్టు ఎరువుగా మార్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో కంపోస్ట్ షెడ్లను ఏర్పాటు చేసింది. ఆశించిన స్థాయిలో ఈ కార్యక్రమం అమలు కాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు ప్రస్తుతం వృధాగా పడి ఉన్నాయి.

**నీరుగారుతున్న లక్ష్యం...**

ఒక్క కంపోస్టు షెడ్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.5లక్షలు ఖర్చు చేసింది. కానీ జీపీలు ఈ షెడ్లను ఉపయోగించడం లేదు. ఇళ్ల నుంచి సేకరించిన ఆహారపదార్థాలు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వ్యర్థాలను వేరుచేసి ఎరువుగా మారే పదార్థాలను కంపోస్టు గుంతల్లో వేస్తారు. సేంద్రియ ఎరువుగా మారిన అనంతరం గ్రామపంచాయతీల పరిధిలో హరితహారంలో నాటిన మొక్కలు , నర్సరీలతో పాటు రైతులకు అందించాలని నిర్దేశించారు.ప్లాస్టిక్ బాటిళ్లు, గాజు సీసాలు, ఇతర వస్తువులను విక్రయించడం ద్వారా జీపీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయని లక్ష్యంగా ప్రారంభించిన పథకం ఆచరణలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో అనుకున్న లక్ష్యం నీరుగారుతోంది.

**తయారు కాని కంపోస్టు ఎరువు...**

ఉమ్మడి జిల్లాలోప్రతి గ్రామపంచాయతీలకు ఒక ట్రాక్టర్‌తో పాటు వాటర్ ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో ఇంటింటికి చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేశారు. కానీ చాలా మంది తడి, పొడి చెత్తను వేరు చేయకుండా అందిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది వాటిని వేరు చేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామపంచాయతీ విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే వీటి ఉద్దేశం. కానీ గ్రామల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడంలేదు. చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**సేంద్రీయ ఎరువు తయారీచేసేలా చర్యలు తీసుకుంటాం : చుంచు శ్రీనివాసరావు (ఎంపీడీవో చింతకాని)**

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ సజావుగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కంపోస్ట్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. నిత్యం సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. షెడ్లలో పూర్తిస్థాయిలో సేంద్రియఎరువు తయారీకి చర్యలు చేపడతాం.

## మున్సిపల్ కార్మికుల దుస్తుల కుట్టుమిషన్ డబ్బులు ఎవరి ఖాతాలోకి..

-నేటికి కార్మికులకి ఇవ్వని డబ్బులు
-కలెక్టర్ జోక్యం చేసుకుంటే వాస్తవాలు బయటికి..






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలల క్రితం మున్సిపాలిటీ నుంచి దుస్తులు అందించారు. అందించిన బట్టలను కుట్టించుకునే అందుకు కార్మికులకు ఒక్కొక్కరికి కుట్టించుకునేందుకు రూ.1000లు డబ్బులు ఇవ్వాలి. నేటి వరకు ఏ ఒక్క కార్మికునికి కుట్టి కూలి ఇవ్వలేదు. కనీసం ఆ డబ్బులు ప్రస్తావన కూడా తేలేదు. కుట్టు కూలి డబ్బులు వెయ్యి రూపాయలు ఒక్కొక్కరివి అంటే సుమారు రూ.2లక్షలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయి. కార్మికుల దుస్తుల కుట్టు కూలీలకు ఎందుకు డబ్బులు అందించలేదు. ఇచ్చిన డబ్బులు ఏమైపోయాయి. ఎవరి ఖాతాలో ఉన్నవి అనేది తెలియాల్సిన అవసరం కూడా ఉంది. ఇప్పటికే జనరల్ ఫండ్ నిధులు పక్కదోవ పట్టిన విషయంలో ఒకరిని సస్పెండ్ చేయడం, క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఆదేశాలు కూడా ఇచ్చిన సందర్భాలు లేకపోలేదు. మున్సిపాలిటీలో ఎప్పుడు అవినీతి మరకలే కనపడుతున్నాయి తప్ప స్వచ్ఛమైన పాలన కనిపించడం లేదని చెప్పవచ్చును. గత కమీషనర్ చింతా వేణు సమయంలో పంపిణీ చేసిన కార్మికుల దుస్తుల పంపిణీకి సంబంధించి కుట్టుకూలి డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయి. ఎవరి ఖాతాలోకి వెళ్లాయి, అసలు ఎందుకు ఇవ్వలేదు, డబ్బులు ఖజానా ఖాళీ చేశారా, ఇది ఒక మిస్టరీగానే ఉందని చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీ అంటనే అవినీతికి మచ్చల పేరు మోస్తుంది. ఆ మచ్చ సరిదిద్దే వారే కనిపించడం లేదని చెప్పవచ్చును. గతంలో ఇచ్చిన బట్టలనే నేటి వరకు కుట్టించుకోకుండా కొంతమంది అలాగే ఉన్నారు. కొంతమంది డబ్బులు ఇచ్చి కుట్టించుకున్నారు, కాని వారికి ఇవ్వాల్సిన డబ్బులు మాత్రం ఎవరు ఇవ్వడం లేదు, అడిగితే సమాధానం లేదని చెప్పవచ్చును. జిల్లా కలెక్టర జోక్యం చేసుకొని కార్మికుల దుస్తులు కుట్టుకూలీకి ఇవ్వాల్సిన డబ్బులు ఎవరి వద్ద ఉన్నవో ఏమైనా తెలుస్తుంది.

## మధిర మున్సిపాలిటీలో నామినేషన్, పరిశీలన ప్రక్రియ పూర్తి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీలో 22 వార్డులకు గాను వివిధ పార్టీల నుంచి 178 నామినేషన్లు దాఖలయ్యాయని, అవి మొత్తం ఆమోదించబడ్డాయని తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు, మున్సిపాలిటీ కమీషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం మధిరలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3గంటల వరకు విత్ డ్రా చేసుకునే వీలుటుంటందని, ఒకే అభ్యర్థి రెండు మూడు వార్డుల్లో నామినేషన్ వేసుకున్న సందర్భంలో ఒక్క నామినేషన్ మాత్రమే ఉంచి మిగిలిన వాటిని విత్ డ్రా చేసుకోవాలని, లేని పక్షంలో పూర్తిగా నామినేషన్ చెల్లదని తెలిపారు. మధిర మున్సిపాల్టీలో ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికలకు సంబంధించి 17 ప్రాంతాల్లో 22 వార్డుల్లో 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 14 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని, మున్సిపాల్టీలో మొత్తం ఐదు డివిజన్లో తొమ్మిది రూట్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. మున్సిపాల్టీలోని ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకోవాలని, ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.49వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేయటం జరుగుతుందని వారు తెలిపారు.

# తేగడ ఇసుక ర్యాంపు రహదారి వివాదం

- అడ్డుకున్నగ్రామస్తులు





**ప్రజాపక్షం/చర్ల :** తేగడ ఇసుక ర్యాంపుకు లోడు కోసం వచ్చిన లారీలను తేగడ, మేడువాయి గ్రామస్తులు అడ్డుకున్నారు. తాలిపేరు ఒడ్డున గోదావరి తీరం వెంబడి అక్రమంగా మూడు కిలోమీటర్ల మేరా గ్రావెల్ రహదారిని ఇసుక లారీల కోసం శ్రీ వీరభద్ర మహిళా సాండ్ క్వారీ సొసైటీ వారు నిర్మించారు. శనివారం అక్రమ రహదారిపై వచ్చిన లారీలను ఆయా గ్రామస్తులు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. తమ గ్రామాల సమీపంలో సీతమ్మ సాగర్ కరకట్ట కోసం కేటాయించిన భూముల్లో రహదారులు వేసి ఇసుక తోలకాలు సాగించడం వల్ల రాబోయే వానా కాలంలో వరదలు వచ్చి తమతమ గ్రామాలు నీటమునిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా లారీలను అడ్డుకున్న మేడువాయి, తేగడ గ్రామస్తులకు, మహిళా సొసైటీ సభ్యులకు మధ్య తీవ్ర వివాదం మొదలైంది. తేగడ సర్పంచ్ జమ్ముల మురళీ, పంచాయితీ కార్యదర్శి హర్షిణి అక్కడకు చేరుకుని సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తేగడ గ్రామస్తులు చిరిగిడి నరేష్ ఇసుక లారీలను అడ్డుకోవడంతో వివాదం పెద్దదయింది. దనపై ధౌర్జన్యం చేసిన ఇసుక సొసైటీ మహిళలపై పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు నరేష్ తెలిపాడు. మొదట్నుంచి ఈ రహదారి పట్ల రెండు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల అనాలోచిత చర్య వల్ల ఈ అక్రమ రహదారి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ గ్రావెల్ రహదారిని నిలుపుదల చేసి తమ గ్రామాలను వరద ముప్పు నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చేసిన సేవలు కలకాలం గుర్తుంటాయి : ఎస్‌పి




**ప్రజాపక్షం/కొత్తగూడెం:** పోలీస్ శాఖలో సిబ్బంది ప్రజల కోసం చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ, ఏఆర్ ఎస్ఐ లను తన కార్యాలయ అవరణలోని కాన్ఫిరెన్స్ హాల్లో ఘనంగా సత్కరించారు. 43 సం. పాటు పోలీస్‌శాఖలో పనిచేసి ప్రస్తుతం స్పెషల్‌బ్రాంచ్ లో విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మంచా నాయక్‌ను, 41 సం.తమ సేవలను అందించి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ సూర్యనారాయణలకు ఎస్‌పి పూల మాలలు వేసి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉద్యోగలు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం రోహిత్ రాజ్ మాట్లాడుతూ ఈ ఇద్దరు పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కంటుబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలోనికి వచ్చిన అధికారులు, సిబ్బంది స్పూర్తిగా తీసుకోవాలన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తనను సంప్రదించాలని, ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేసి రావాల్సిన ప్రతిఫలాలను త్వరలో అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఎంటిఓ సుధాకర్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో జోరుగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం






**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీలో తెలుగుదేశం బలపర్చిన బిఆర్ఎస్ పార్టీ 21, 22వ వార్డుల అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, చైర్మన్ అభ్యర్థి కాసాని పద్మతో కలిసి శనివారం ముమ్మరంగా గడగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ వార్డు అభ్యర్థులైన ఏలేటి పార్వతీ, జుజ్జువరపు శ్రీరామూర్తిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని, అభివృద్ధి కేవలం బిఆర్ఎస్‌తో సాధ్యమని, మున్సిపాల్టీ పురోభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడాపోటీలతో క్రీడాకారుల ప్రతిభ వెలుగుచూస్తుంది



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గ్రామీణస్థాయి క్రీడలతో క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగుచూస్తుందని కొణిజర్ల మండల తహశీల్దార్ అరుణ కుమారి, సిఎం కప్ మండల చైర్‌పర్సన్ గుగులోత్ వర్షా అన్నారు. మండలపరిదిలోని తనికెళ్లలో మండల సిఎం కప్ క్రీడాపోటీల ప్రధానోత్సవ కార్యక్రమం మండల క్రీడాకార్యదర్శి షేక్ రంజాన్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతు క్రీడలు సమానత్వాన్ని, ఐక్యతను పెంపొదిస్తాయని అన్నారు. గ్రామంలోని క్రీడాకారులు వెలికి తీయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల గ్రామసర్పంచ్ గడల కళావతి, సిఎంకప్ మండల కన్వీనర్ డి అబ్రహాం, మండల స్కూల్‌గేమ్ సెక్రటరీ నక్కా వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు బోడ సక్రమ్, నూనావత్ శంకర్‌రావు, గుమ్మిడెల్లి రాంబాబు, నక్క మహేష్, రవి, రవికుమార్, మారతమ్మ, సాయికృష్ణ, గ్రామపెద్దలు గడల భాస్కర్‌రావు, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.

## అవినీతికి కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ అవినీతి కమీషన్లకు కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సతీమణి మల్లు నందిని విక్రమార్కపై మాట్లాడే స్థాయి తాతా మధుకు కాని, బిఆర్ఎస్ పార్టీ నాయలకు కాని లేదన్నారు. రాష్ట్రంలో పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అణచివేశారని, మహిళలంటే చులకన భావన బిఆర్ఎస్ పార్టీలో ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎవరినీ భయపెట్టాల్సిన అవసరం లేదని, డబ్బుపెట్టి కొనాల్సిన అవసరం కాని లేదని, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. మధిర మున్సిపాల్టీలో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని, మధిర అభివృద్ధి మల్లు భట్టివిక్రమార్కతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల బిసి సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణనాయక్, కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, పత్తేపురపు సంగయ్య, ఆవుల కిరణ్, సువర్ణకంటి రామకృష్ణ, షేక్.గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గోడౌన్లను తనిఖీ చేసిన రాయల



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మండల పరిధి దెందుకూరు గ్రామంలోని గిడ్డంగుల సంస్థ గోడౌన్లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సన్న బియ్యం నాణ్యతను, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సన్నబియ్యం రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎగుమతులు, దిగుమతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయి



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటుగా శారీరక దృఢత్వం కలిగిస్తాయని ఎంపిడిఓ బొగ్గా నారాయణ అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లి (ఎస్ ) పంచాయితీలో రెండవ విడత మండల సిఎం కప్ క్రీడలను శనివారం నిర్వహించారు. ఎంపిడిఓ, గ్రామ సర్పంచ్ భూక్యా లక్ష్మిలు క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, గెలుపుపై కాంక్ష పెరుగుతుందని చెప్పారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. నేటి ఓటమిని రేపటి గెలుపు కోసం శ్రమించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. క్రీడలను స్పూర్తిగా తీసుకొని గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారిని మెరుగైన క్రీడాకారులుగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడలను నిర్వహిస్తున్నదన్నారు. క్రీడల్లో ఉత్తమంగా రాణించి గ్రామ స్థాయి నుండి గ్లోబల్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం. శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, వార్డ్ సభ్యులు, పిఈటిలు, పిడిడబ్ల్యా, అధికారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డిఏవి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిరంతర బోధనతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని కేటిపిఎస్ ఏడిఎం శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పరిధి డిఏవి పాఠశాలలో శనివారం సైన్స్, గణితం, ఆర్ట్ ఎక్స్‌పో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా 150 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆర్ట్ టీచర్ పి. సుశాంత ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రతేక ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలచే మండల్ ఆర్ట్, వేస్ట్ మెటీరియల్, న్యూస్ పేపర్స్‌తో మోడలింగ్, మధుర మీనాక్షి, బతుకమ్మ, తిరుమల తిరుపతి ప్రతిమలను చేయించారు. 8వ, తరగతికి చెందిన విన్నినివేదిత వేసిన పోస్టర్ పేయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యర్థాలతో విద్యుత్, పొల్యూషన్ ఎలా ఉత్పత్తి అవుతున్నది,సోలార్ సిస్టం, ఇన్ఫినిటీ వెల్ లాంటి పలు స్టాల్లను ఏర్పాటు చేశారు. వీటిని తిలకించిన ఏడిఎం విద్యార్థులను, పాఠశాల ప్రిన్సిపాల్‌నైస్‌షాజీలను ప్రత్యేకంగా అభినంధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన కలుగుతుందన్నారు. జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహిపాల్, సిహెచ్ మహేందర్, సిహెచ్ఎన్ వీరబాబు, పి. లీనా, శైలజ, సమత, ఫాతిమారాణి, కేఎల్. శ్రీనివాస్, సిహెచ్ .బాలాపూర్ణ కుమార్,యు. శ్రీనివాస్, డి. చంద్రకళ, ప్రసాద్, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.